నైతిక 'విజయ' గౌరి!

నైతిక 'విజయ'గౌరి! సిద్ధాంత నిబద్ధత గల యుటిఎఫ్! కొంతమంది వెన్నెముకలు తాకట్టు పెట్టినా, మూడో స్థానంలో నిలవడం.. ఓట్లు వేయని మహిళా ఉపాధ్యాయులకు చెంపపెట్టు!. వచ్చిన మొత్తం 5,990 ఓట్లలో, తొలి ప్రాధాన్యత గానే 5,804 ఓట్లు రావడం.. నీ నిజాయితీకి.. యుటిఎఫ్ నిబద్ధతకు నిదర్శనం. కులం.. అధికారం... ఇచ్ఛకం.. అమ్మా! నీ వెంట రాకపోయినా.. కళింగాంధ్ర సామాజిక, బుద్ధిజీవుల చరిత్రలో.. నీవు ఒక ఒద్దికైన.. సిద్ధాంత నిబద్ధమైన విలువల విప్లవ గౌరవమ్మువి.

... అభినందనలు కామ్రేడ్ సోదరీ!

- నల్లి ధర్మారావు, కవి, రచయిత

అంతన్నారు... కొంతే కొంటారట

- చివరి గింజ వరకు కొంటామని మంత్రి అచ్చెన్న ప్రకటన
- తొలుత 4.90 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం
- రైతుల వద్ద లక్షన్నర టన్నులకు పైగా ధాన్యం
- మరో 20 వేల టన్నులే కొనేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

బూర్జ మండలం నారాయణపురంలో కళ్లంలో ధాన్యం బస్తాలు

రైతుల నుంచి చివరి గింజ వరకు కొంటామని ఎవరూ ఆందోళన చెందొద్దంటూ రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఖరీఫ్ ప్రారంభంలో గొప్పగా ప్రకటించారు. ధాన్యం కొనుగోలు విషయం దగ్గరకొచ్చేసరికి రైతులు తమ ధాన్యం కొనుగోలు చేయాలని బతిమిలాడుకున్న పరిస్థితికి తీసుకొచ్చారు. లక్ష్యం పూర్తయిందనే పేరుతో నెల రోజులుగా పైగా అధిక శాతం మండలాల్లో కొనుగోలు నిలిపివేశారు. రైతుల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో 20 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దయతలిచింది. తమ దగ్గర ఉన్న ధాన్యాన్ని అంతటినీ కొనుగోలు చేస్తుందని ఆశించిన అన్నదాతలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ధాన్యాన్ని వచ్చిన రేటుకు దళారులకు అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,59,495 ఎకరాల్లో వరి వేశారు. ఈ సంవత్సరం తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోనూ ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావచ్చని పౌర సరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. అన్ని లెక్క గట్టి చివరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకనుగుణంగా 630 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 4,86,309 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. లక్ష్యం సమీపించడంతో జిల్లాలో నామమాత్రంగానే కొనుగోలు సాగుతున్నాయి. నెల రోజులకు పైగా జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలు జరగక రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొనుగోలుపై రైతుల నుంచి వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో ప్రభుత్వం అదనంగా మరో 20 వేల టన్నులను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది.

కొనుగోలు లేక కళ్లాల్లోనే ధాన్యం

ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ధాన్యం దిగుబడి బాగానే వచ్చింది. కానీ ఆమేరకు కొనుగోలు చేపట్టకపోవడంతో దాదాపు అన్ని మండలాల్లోనూ రైతుల వద్ద భారీగా ధాన్యం నిల్వలు ఉండిపోయాయి. దళారులకు అమ్ముకోగా జిల్లాలో రైతుల వద్ద మరో లక్షన్నర టన్నుల వరకు ధాన్యం ఉండొచ్చని ఒక అంచనాగా ఉంది. ఆమదాలవలస మండలంలో 22 వేల టన్నులకు పైగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అంచనా వేయగా 15,997 మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే సేకరించారు. ఎచ్చెర్లలో 11 వేలకు పైగా టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా 6,366 టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేశారు. జి.సిగడాంలో 21 వేల టన్నులకు పైగా ధాన్యం వస్తుందని అంచనా వేయగా, ప్రస్తుతం 16,055 టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేశారు. గారలో 31 వేల టన్నుల ధాన్యం వస్తుందని భావించగా 22,074 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. శ్రీకాకుళం మండలంలో 29 వేల టన్నులకు పైగా ధాన్యం వస్తుందని భావించగా 20,669 టన్నులను కొనుగోలు చేసి ఆపేశారు. జిల్లాలోని అత్యధిక మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

20 వేల టన్నులు ఏ మూలకు సరిపోతాయి?

ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్న పరిస్థితి నెలకొంది. దళారులు తక్కువ ధరకు అడుగుతుండడంతో, వారికి ఇచ్చేందుకు ఇష్టం లేక ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ధాన్యం కొనుగోలుపై రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో ప్రభుత్వం లక్ష్యాన్ని 4.90 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 5.10 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచింది. అంటే 20 వేల టన్నులను పెంచిందన్న మాట. జిల్లాలోని 30 మండలాలకు దీన్ని సర్దుబాటు చేస్తే మండలానికి 700 టన్నుల్లోపే పడుతుంది. దీన్ని ఏవిధంగా సర్దుబాటు చేయాల్లో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రభుత్వం కొనకపోతే దళారులే దిక్కు

భూమిని కౌలుకు తీసుకుని రెండున్నర ఎకరాల్లో వరి వేశాను. ధాన్యాన్ని మిల్లు వద్దకు తీసుకెళ్తే లక్ష్యం అయిపోయిందంటున్నారు. మండల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే, సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్తున్నారు. ప్రభుత్వం కొనకపోతే దళారులకు అమ్ముకోవాల్సి వస్తుంది. చాలా నష్టపోతాం. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.

- ఆర్.పట్టాభినాయుడు, కిలాంతరి (బూర్జ)

తక్కువ ధరకు అడుగుతున్నారు

ఎకరాన్నర వరి వేశాను. సుమారు 50 బస్తాల ధాన్యం వచ్చింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ఆపేయడంతో వ్యాపారులను సంప్రదించాను. చాలా తక్కువ ధరకు అడుగుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 80 కేజీల బస్తాకు రూ.1940 రావాల్సి ఉండగా, వ్యాపారులు రూ.1650 ఇస్తామని అంటున్నారు.

- దోల యోగీశ్వరరావు, అల్లెన (బూర్జ)

మాట్లాడుతున్న కన్నబాబు

రాష్ట్రంలో కక్షసాధింపు పాలన

- అక్రమ కేసులతో వేధింపులు
- వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ కన్నబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో కక్షసాధింపు పాలన సాగుతోందని మాజీ మంత్రి, వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు విమర్శించారు. జిల్లా పర్యటనలో భాగంగా పెద్దపాడు సమీపాన నిర్మాణంలో ఉన్న వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజల కష్టాలు పట్టించుకునే వారు లేరని విమర్శించారు. చంద్రబాబు, పవన కళ్యాణ్ ప్రజలకు మభ్యపెట్టి బూటకపు హామీలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వ తొమ్మిది నెలల పాలనలో సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేక చేతులెత్తేశారని విమర్శించారు. ఇచ్చిన మాటకు కట్టుబడే అలవాటు చంద్రబాబుకు లేదన్నారు. అధికారం కోసం మోసపూరిత మాటలు చెప్పడం, అధికారంలోకి వచ్చాక వాటిని పక్కన పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. ఆయన సహజ గుణాన్ని తెలిసి కూడా ప్రజలు ఓటేసి మరోసారి మోసపోయారన్నారు. వైసిపికి ఓటేసిన వారికి సంక్షేమ పథకాలు అమలు చేసేది లేదంటూ బహిరంగంగానే చంద్రబాబు చెప్తున్నారని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఓటమి ఆ పార్టీ నాయకులకు చెంపపెట్టు వంటిదన్నారు. ఎన్నికల నామినేషన్ మొదలు పాకలపాటి రఘువర్మ తమ అభ్యర్థి అని ప్రకటించి, ఆయనతో కలిసి ప్రచారంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యాక మాట మార్చారన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు, వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. వైసిపిలో సామాన్య కార్యకర్తకు సైతం ఏ కష్టమొచ్చినా తామంతా అండగా నిలుస్తామన్నారు. కూటమి నాయకులు చేస్తున్న తప్పిదాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు వైసిపి శ్రేణులు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, విజయనగరం జెడ్‌పి చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్, వైసిపి యువజన విభాగం నాయకులు మెంటాడ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ధాన్యం కొనుగోలుకు చర్యలు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - బూర్జ

రైతుల వద్ద ఉన్న మిగులు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మండలంలోని గుత్తావల్లి, లాబాం, లక్కుపురం, పాలవలసలోని పంట పొలాల్లో ఉన్న ధాన్యం కుప్పలను మంగళవారం పరిశీలించారు. ఆలస్యంగా పండిన ధాన్యాన్ని లక్ష్యాలు పూర్తయ్యాయని రైతు సేవా కేంద్రాలు, మిల్లర్లు చెప్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పొలాల్లోనే కుప్పలుగా ఉండిపోయాయని తెలిపారు. నూర్పులు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రహదారి పక్కనే బస్తాలుగా నెట్లు వేశామన్నారు. రాత్రివేళల్లో ధాన్యం బస్తాలు చోరీకి గురవుతున్నాయని వాపోయారు. దీనిపై జెసి స్పందిస్తూ రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడతామని హామీనిచ్చారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.శ్రీనివాసరావు, సిఎస్‌డిటి మురళి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

విద్యార్థుల పస్తులు

- మధ్యాహ్న భోజనానికి నాశిరకం బియ్యం సరఫరా
- ముద్దయిన అన్నం పారబోత

ప్రజాశక్తి - లావేరు

లావేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి నాశిరకం బియ్యం సరఫరా చేయడంతో విద్యార్థులు మంగళవారం పస్తులు ఉన్నారు. కనీసం తినడానికి వీల్లేని విధంగా ముద్దగా అయిపోవడంతో బయట పారబోశారు. ఈ పాఠశాలలో మూడు నుంచి పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని తరగతులు కలిపి మంగళవారం మొత్తం 283 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరు ఎప్పట్లానే మధ్యాహ్న భోజనానికి ప్లేట్లు పట్టుకుని వెళ్లగా, వారికి వేసిన అన్నం ముద్దలా ఉండడంతో బయట పారబోశారు. కొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లి తినగా, మరికొందరు విద్యార్థులు ఖాళీ కడుపులతోనే ఉన్నారు. విషయాన్ని తెలుసుకున్న పాఠశాల ఎస్‌ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు పాఠశాల హెచ్‌ఎం పి.జగన్నాథరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వంట కార్మికులను ప్రశ్నించారు. తమ తప్పు లేదని బియ్యం అలా ఉన్నాయని వారు చెప్పారు. ఎక్కువసేపు ఉడికిస్తే ముద్ద అవుతుందని, కొంచెం ముందుగా వార్చితే బియ్యంలానే ఉంటుందని తెలిపారు. దీంతో రాంబాబు తహశీల్దార్ జోగారావుకు ఫిర్యాదు చేయగా, ఆయన డిటి శ్రీనివాసరావు, విఆర్‌ఒ వేణుగోపాలరావుతో కలిసి పాఠశాలకు వచ్చి ముద్దగా ఉన్న అన్నాన్ని పరిశీలించారు. దగ్గర ఉండి వంట కార్మికులతో మళ్లీ వండించగా ముద్దలా మారడంతో, పౌరసరఫరాల గోదాం ఇన్‌ఛార్జికి తహశీల్దార్ ఫోన్ చేశారు. లావేరు పాఠశాలకు వచ్చిన బియ్యం బాగాలేవని, 44 బస్తాలను మార్చి మంచి బియ్యాన్ని పంపించాలని ఆదేశించారు.

బయట పారబోసిన ముద్దగా ఉన్న అన్నం

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నియోజకవర్గాల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు ముందస్తు అనుమతి లేకుండా సెలవుపై వెళ్లిన సెక్రటేరియట్ సిబ్బంది సెలవులను సంబంధిత జిల్లా అధికారులు రెగ్యులరైజ్ చేయరాదన్నారు. 90 శాతం కన్నా సచివాలయ సిబ్బంది హాజరు తగ్గరాదని స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహిస్తున్న మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుల లక్ష్యాలు సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిఎంఎవై 2.0 దరఖాస్తు చేసుకున్న వారు 41,862 మంది ఉన్నట్లు హౌసింగ్ పీడీ నగేష్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి సర్వే 8 నుంచి 18 లోపు పూర్తి చేయాలని, నిరుపేదలను గుర్తించడానికే ఈ సర్వే ఉపయోగపడుతుందని వివరించారు. ఐవిఆర్‌ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్), క్యూఆర్ కోడ్, కాల్స్ వంటి విధానాల ద్వారా సర్వేల్లో సానుకూల ప్రజా దృక్పథం రావాలని, ప్రజా సానుకూల దృక్పథంలో మంచి ఫలితాల కోసం ప్రతి శాఖ నోడల్ అధికారిని నియమించాలన్నారు. ప్రజలకు అందే సేవలలో లోపాలను గుర్తించి సరైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఎక్కువ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధుల కొరత లేదని, ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎవరైనా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఆర్‌ఎస్‌కె వారీగా జాబితా ఇస్తే వారికి ధాన్యం సేకరణకు అనుమతి మంజూరు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సిపిఒ లక్ష్మీప్రసన్న, వ్యవసాయ శాఖ అధికారి కె.త్రినాథస్వామి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్‌ఇ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ల ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్లపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద సర్వేయర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. రీ సర్వే పేరుతో వేర్వేరు మండలాల్లో నియమించి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు ఎడి పనులు అప్పగిస్తున్నారని చెప్పారు. మరోవైపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను కేటాయించి, సచివాలయం పరిధిలో క్లియర్ చేయాలని కలెక్టరేట్ నుంచి ఫోన్ చేస్తున్నారని తెలిపారు. దీనికితోడు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఇ , ఇతర సర్వేల్లో పాల్గొనాలని ఎంపిడిఒలు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నిబంధన పాటించాలని సచివాలయ కార్యదర్శుల నుంచి ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. అలా వేయకపోతే వేతనాల్లో కోతలు విధిస్తామని బెదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పనిఒత్తిడి కారణంగా ఇద్దరు ఉద్యోగులు జిల్లాలో చనిపోయారని, అలాంటి పరిస్థితులే ఇప్పుడు కొనసాగుతున్నాయన్నారు. సర్వేయరు విధి విధానాలపై ఉన్నతాధికారులు స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు తమ సమస్యలపై దృష్టిసారించి న్యాయం చేయాలని కోరారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సర్వేయర్లు

రైస్‌మిల్లులో ప్రమాదం

కార్మికుడు మృతి

కోటబొమ్మాళి : మండలంలోని చిన్నబమ్మిడి పంచాయతీ పరిధిలోని శ్రీ వెంకటసత్య మోడ్రన్ రైస్‌మిల్లులో సోమవారం రాత్రి సంభవించిన ప్రమాదంలో చిన్నబమ్మిడికి చెందిన కార్మికుడు గొండు రాజారావు (34) మృతి చెందాడు. రైస్‌మిల్లులో ధాన్యం ఆడుతున్న సమయంలో బస్తా ధాన్యం తొట్టెలో వేసి మరో బస్తా తెచ్చేందుకు వెళ్తుండగా, కాలు జారి ధాన్యం నిల్వ చేసే అండర్‌గ్రౌండ్‌లో పడిపోయాడు. ఈ ప్రమాదంలో రాజారావు తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కళాసీలు మిల్లు యజమానికి, 108కు సమాచారం ఇచ్చారు. 108 ఘటనాస్థలికి చేరుకునేసరికే రాజారావు మృతి చెందాడు. మృతుని భార్య జగదీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి మంగళవారం తరలించారు. మృతునికి కుమార్తె గీతామాధురి (9), కుమారుడు తేజ (6) ఉన్నారు. పిల్లలు చిన్నవారు కావడం, తల్లిదండ్రులు సుభద్ర, ఆదినారాయణ వృద్ధులు కావడంతో, ఆ కుటుంబానికి పెద్దదిక్కు అయిన రాజారావు మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. అందరితో కలివిడిగా ఉండే రాజారావు మృతి చెందడంతో చిన్నబమ్మిడిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణతో పాటు ఇతర చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. నగరంలోని ఐసిడిఎస్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, ఇతర నేర సంఘటనల నుంచి రక్షణ పొందాలన్నారు. నేరస్తులకు చట్టపరంగా శిక్ష పడాలంటే చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అత్యాచార ఘటనలు, హత్యలపై చట్టాలకు అనుగుణంగా పోలీసులు విచారణ చేపట్టాలన్నారు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ గృహ హింస నుంచి మహిళలను రక్షించేందుకు మహిళల రక్షణ చట్టం-2005 రూపొందించబడిందని, 2016 అక్టోబర్ 26 నుంచి దీన్ని ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి వ్యవస్థాపకులు కరణం హారికా ప్రసాద్, పిఒఐసి మెట్ట మల్లేశ్వరరావు, బాల్య వివాహ చట్టంలోని పలు అంశాలను వివరించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, మానసిక పరిపక్వత లేకుండా వివాహాలు చేయడం నష్టదాయకమన్నారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ ఎడి కె.కవిత, ఐసిడిఎస్ నోడల్ అధికారి మణెమ్మ, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ లక్ష్మి, పిఒఎన్‌ఐసి లక్ష్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

కంటి వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రామస్థాయిలో కంటి వ్యాధులపై ఆప్తాలమిక్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వి బాలమురళీకృష్ణ అన్నారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆప్తాలమిక్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆప్తాలమిక్ అధికారి వారి పరిధిలోని ఎన్‌జిఒ, ఆస్పత్రి వారు నిర్వహించే కేటరాక్టు క్యాంపులను సందర్శించి అంధత్వంతో బాధపడుతున్న వారిని రిఫర్ చేయాలని సూచించారు. ప్రతి నెలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కంటి వ్యాధులతో బాధపడుతున్న వారిని సకాలంలో పరీక్షించి అవసరమైన వారిని జిల్లా ఆస్పత్రులకు పంపాలన్నారు. ప్రతినెలా అడ్వాన్స్ టూర్ ప్రోగ్రాం ప్రకారం విధిగా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.త్రినాథరావు, డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్ కుమార్, ఆప్తాలమిక్ అధికారులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

CHANGE OF NAME

I **GUJJU LOKESH**(Old Name), S/o Late Narasimhulu, Door No: 1-80, Gudem Village, Tekkali Mandalam, Srikakulam District AP, Pin-532201.
Have Change my Name from **GUJJU LOKESH** (Old Name) to **GUJJU LOKESWARA RAO** (New Name) hence forth I am being called as **GUJJU LOKESWARA RAO** For all purposes.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A .No: 761/2024 in O.S No: 4/2015

Between:-
కూన వెంకటరావు ...పిటిషనర్లు/వాదులు
And:-
కూన మన్మధరావు వగైరాలు ....రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To,
R-1: కూన మన్మధరావు, S/o వెంకటరావు
R-2: కూన ఢిల్లీ కృష్ణ, S/o వెంకటరావు
సా॥ గోరింట గ్రామం, గోకర్నపల్లి పోస్టు, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు పిటీషనులో పిటీషనర్/వాది మీ వగైరాలు పైన ఫైనల్ డిక్రీ జారీచేయమని IA.No.761/2024 పిటిషన్ ఫైల్ చేసినందున మీకు ఆక్షేపణలు ఉన్న ఉడల మీ ఇరువురు స్వయంగా గాని, లేదా వకీలు గారి ద్వారా గాని **తే 10-03-2025 దీన ఉదయం గం॥ 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మనవి చేసుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానం చేయడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

వై. సత్య శ్రీనివాస్
వై. రమేష్
న్యాయవాదులు,
రాజాం, విజయనగరం జిల్లా.

వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

ఆశాలకు కనీస వేతనాలు, ఒప్పంద జిఒల విడుదలకు మార్చి 6న చలో విజయవాడను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించాలని, చలో విజయవాడ వెళ్తున్నట్లు తెలియజేస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యాన రావాడ, పాతర్లపల్లి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పి.ఎస్.జనార్ధననాయుడు, బి.వి.పి.అనూషలను మంగళవారం కలిసి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీసవేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ సెలవులు, క్యాజువల్ లీవ్స్, వయోపరిమితి 62కు పెంపు, విశ్రాంత బెనిఫిట్లు, ఇన్స్యూరెన్స్, మట్టి ఖర్చులు తదితర ఒప్పంద జిఒలు అమలు చేయాలన్నారు. గత ఐదేళ్లుగా ఒక్క రూపాయి వేతనం పెంచలేదని, పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంతమ్మ, డి.మేరి, పి.లక్షిం, ఎం.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి

జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

కోటబొమ్మాళి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించి విజయవంతం చేయాలని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. స్థానిక కోర్డు ఆవరణలో న్యాయవాదులతో, పోలీసులతో ముందస్తు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా కక్షిదారులను గుర్తించి వారికి రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కువ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించే న్యాయవాదులకు, కక్షిదారులకు జాతీయ లోక్‌అదాలత్ రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు లఖినేని శ్రీనివాసరావు, వై.వెంకటరావు, బి.నారాయణరావు, బి.మధు, జి.జీవన్, పి.బాబూరావు, బి.ధర్మారావు, కె.వెంకటరావు పాల్గొన్నారు.

రక్షిత నీటి పథకాలు పరిశీలన

నందిగాం : గ్రామాల్లో వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఎంపిడిఒ టి.రాజారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని నందిగాం, దేవనభద్ర, నర్సిపురం గ్రామాల్లోని రక్షిత తాగునీటి పథకాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు పరిసరాల పరిశుభ్రంగా ఉంచేవిధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

గ్యాస్ ఏజెన్సీ డీలర్, డెలివరీ బాయ్ సమక్షంలో విచారణా!

సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి- పొందూరు

వంట గ్యాస్ ను ఇంటింటికీ డెలివరీ చార్జీలు అదనంగా వసూళ్లు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై ఇండేన్ గ్యాస్ సేల్స్ మేనేజర్ ఆధిత్య ప్రభవ్ మంగళవారం విచారణ చేపట్టారు. విచారణ సమయంలో ఏజెన్సీ డీలర్, డెలివరీ బాయ్‌లను వెంటపెట్టుకోవడంపై సర్వత్రా విమర్శలు చోటుచేసుకున్నాయి. విచారణకు వస్తున్న సమాచారం ముందస్తుగా గ్యాస్ ఏజెన్సీకి ఉండటంతో వీరు వినియోగదార్ల వద్దకు వెళ్లి అదనంగా ఛార్జీలు తీసుకోవడంలేదని చెప్పాలంటూ బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. విచారణకు వచ్చిన అధికారి సైతం ఏజన్సీకు చెందిన వారిని వెంట తీసుకురావడంతో వినియోగదారులు వారి అభిప్రాయాన్ని నిర్భయంగా చెప్పలేకపోయారు. స్వయంగా కలెక్టర్ సమక్షంలో వినియోగదారులు గ్యాస్ డెలివరీ ఛార్జీలు అదనంగా వసూళ్ల చేస్తున్నట్లు ఇటీవల తెలియజేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకున్న విషయం పాఠకులకు తెలిసిందే. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా వినియోగదారులను విచారించడం శోచనీయం. ఏజన్సీలో ఐదు మండలాల్లో 30 వేల మంది వినియోగదారులు ఉండగా కేవలం పొందూరు మూగోడువీధిలోని అధికారులు విచారించడంపై ఆంతర్యం ఏమిటంటే పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ ఏజన్సీ డీలర్ సమక్షంలో విచారణ చేపడితే పారదర్శకంగా జరగుతుందా? అంటు పలువురు ప్రశ్నిస్తున్నారు. విచారణ సైతం నామమాత్రంగా చేపట్టి

విచారణ చేస్తున్న గ్యాస్ సేల్స్ మేనేజర్

వినియోగదారుల సంతకాలు సేకరణ చేపట్టారు. వినియోగదారుల్లో చాలామంది నిరక్షరాస్యులు ఉండటం వల్ల అధికారులు నివేదిక ఏలా సమర్పిస్తారో వేచి చూడాలి. ఈయన వెంట గ్యాస్ ఏజన్సీ డీలర్ జి.సరోజిని, డెలివరి సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములు కావాలి

నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర సుందరీకరణలో భాగంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, అందులో భాగంగా హోటళ్ల నుంచి వస్తున్న వ్యర్థాల వల్ల సమస్యగా మారుతోందని నగరపాలక సంస్థ కమిషనర్ డివివిబి ప్రసాదరావు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్లలో హోటళ్లు, రెస్టారెంట్ అసోసియేషన్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోటళ్ల నుంచి వ్యర్థాలను ఆన్‌సైట్ కంపోస్టుగా మార్చుకోవాలని సూచించారు. ఎక్కడబడితే అక్కడ వ్యర్థాలను పారబోయడం సరాకాదన్నారు. ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వహణ సక్రమంగా లేని ప్రాంతాల్లో పెద్దఎత్తున పందులు, కుక్కల బెడద ప్రజలను వేధిస్తున్నాయని అన్నారు. మాంసాహార హోటళ్ల పరిసరాల్లో ఈ సమస్య మరింత అధికంగా ఉందన్నారు. అందువల్ల

మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

వ్యర్థాలను ఎక్కడిక్కడ పడవేయడం, కాలువల్లో పాయబోయడం వంటి చర్యలు తగదన్నారు. అలాగే సింగిల్ ప్లాస్టిక్ వాడకాన్ని మార్చుకుని ప్రత్నాయ పద్ధతులను వినియోగించుకోవాలన్నారు. హోటళ్ల యాజమానులు సహకరించాలని సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ హెల్తాఫీసర్ డాక్టర్ పి.సుధీర్‌కుమార్, హెటళ్లు, రెస్టారెంట్ అసోసియేషన్స్ ప్రతినిధులు మెట్ట నాగరాజు, జె.ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

741 మంది గైర్హాజరు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీసు, ఒకేషనల్ పరీక్ష లు మంగళవారం నిర్వహించామని ఆర్ఐఒ ప్రగాడ దుర్గారావు తెలిపారు. ఈ పరీక్షలకు 741 మంది విద్యార్థులు 75 కేంద్రాల్లో గైర్హాజరయ్యారని అన్నారు. జనరల్ కేటగిరిలో 20,637 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 19,981 మంది పాల్గొన్నాని అన్నారు. ఒకేషన్ పరీక్షకు 1329 మందికి గాను, 1244 మంది హాజరయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 21,966 మందికి గాను, 741 మంది పరీక్షకు హాజరుకాలేదన్నారు. ఎక్కడా అవాంచనీయ ఘటనలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించామన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

భద్రతపై అవగాహన అవసరం

రణస్థలం: పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీరాంబాబు తెలిపారు. 54వ జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా పైడిభీమవరం పారిశ్రామిక వాడలో అపిటోరియా, డాక్టర్ రెడ్డిస్, ఆరోయాక్టివా, ఎఒఎల్, అపర్ణ, ఎన్‌ఎసిఎల్, దీపక్ నైట్రేట్, ఫ్రింజ్ లేబరేటరీ, శ్రేయాస్ తదితర పరిశ్రమలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో జాతీయ భద్రతా దినోత్సవాన్ని ఏటా మార్చి 4న నిర్వహిస్తామన్నారు. పర్యావరణం, కార్యాలయ భద్రత, ఆరోగ్య, నియమాలు, ట్రాఫిక్ నియమాలు, మానవ ఆరోగ్య విషయాలతో సహా అన్నిరకాల భద్రతా నిబంధనల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. భద్రత అనేది మన నిత్యజీవితంలో, కర్మాగారంలో ప్రాముఖ్యతను ఇస్తూ ఎటువంటి ప్రమాదాలు గురికాకుండా కార్మికులు తమ కర్తవ్యం నిర్వహించాలన్నారు. అపిటోరియా హెచ్.ఆర్.హెడ్. కమలాకర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

జల వనరులను కలుషితం చేయొద్దు

బిఆర్‌ఎయు విసి రజని

ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

అన్ని జీవులకు నీరే ఆధారమని, దీన్ని సద్వినియోగం చేసుకోవడంతోనే సమాజ భవిష్యత్ ముడిపడి ఉంటుందని డాక్టర అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అభిప్రాయపడ్డారు. వర్శిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-6, శ్రీకాకుళం గ్రామీణ నీటి సరఫరా విభాగం సంయుక్తంగా 'నీటిపై అవగాహన కార్యక్రమాన్ని' మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ నీళ్లే కదా అని దుర్వినియోగం చేస్తే ఈ ప్రపంచానికి మిగిలేవి కన్నీళ్లేనన్నారు. ఉన్న జల వనరులను సద్వినియోగపరడం ఎంత ముఖ్యమో, అవి కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యతా అంతే అవసరమని సూచించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ డి.వనజ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పిఒ డాక్టర్ బి.విఙు నేతృత్వం వహించారు. ముందుగా నీటి అవశ్యకత తెలియజేస్తూ ఎచ్చెర్ల ప్రధాన రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎచ్చెర్లలో కొన్ని కాలనీల్లో నీటిని సేకరించి వాటిలో నాణ్యత పరిశీలనకు ఆర్‌డబ్ల్యుఎస్ విభాగపు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ఎస్ఒ డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఎ.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెళియాపుట్టి : మండలంలోని మహేంద్ర తనయా బ్రిడ్జి వద్ద మంగళవారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన మదన్ జెన్నా (52) మృతి చెందాడు. స్వగ్రామం నుంచి మదన్ జెన్నా, బిసక్ ప్రధాన్ కల్సి మెళియాపుట్టి వస్తున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి పాల వాహనం ఢీ కొనడంతో తీవ్ర మదన్ జెన్నా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దీర్ఘకాలిక లక్ష్యాలతో అడుగులు

బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

దీర్ఘకాలిక లక్ష్యాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం రాష్ట్ర శాసనసభలో బడ్జెట్ పై సాగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన మూలధన వ్యయం భావి తరాలకు సంపదన సృష్టిస్తుందన్నారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 18 కిలోమీటర్ల మేర సిసి రోడ్లు నిర్మించామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని వివరించారు.

టెక్కలి రూరల్ : కురుస్తున్న మంచు

మంచు దుప్పటి

కవిటి: మండలంలో మంగళవారం ఉదయం కురిసిన మంచు ఉద్యానవన పంటలకు దుప్పటిలా అల్లుకుంది. జీడి, మామిడి పంటలు పూత, పిందె దశలో ఉన్న ఇటువంటి సమయంలో ఇంత ఎక్కువ సమయం మంచు కురవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రకృతి ప్రేమికులు మంచు పొరలను ఆస్వాదిస్తూ ఆనందిస్తున్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలిలో ఒక్కసారిగా పొగ మంచు అల్లుకుంది. దీంతో రహదారిపై వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నారులు, వృద్ధులు ఈ పొగ మంచులో తిరిగితే వ్యాధుల బారినపడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గిరిజనులకు 'ఉన్నతి' ప్రయోజనం

మందస: షెడ్యూల్డ్, తెగలులో వెనుకబడిన కుటుంబాల జీవనోపాధులను మెరుగుపరచడానికి అమలు చేస్తున్న ఉన్నతి పథకం సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే గిరిజనులకు ఉత్తమ ప్రయోజనం ఉంటుందని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని కుసుమాల పంచాయతీలో గ్రామ సంఘం పాలకవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచసూత్రాలు పాటిస్తూ... అర్హత కలిగిన గిరిజన ప్రాంతంలో సంఘాలకు గతంలో ఇచ్చిన అప్పులు సక్రమంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ స్వామినాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, విఒఎలు జగబందు, ఆనంద్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రవళ్లిక

మూఢనమ్మకాలను విడనాడాలి

బూర్జ: లేనిపోని అనుమానాలను కలిగి ఉండడం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రతిఒక్కరూ మూఢనమ్మకాలను విడనాడాలని ఎస్ఐ ప్రవళిక సూచించారు. మండలంలోని అల్లినలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. క్రమ పద్ధతిని అలవర్చుకొని శాంతియుత వాతావరణంలో మెలగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి జడ్డు మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ గేదెల బాలసుందర్, మౌళిశ్వరరావు, మండల సోషల్ మీడియా అధ్యక్షులు వారడ రాంబాబు, ఏనుగుతల హరిబాబు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సిసి కెమెరాలు కీలకం

లావేరు: నేరాలు, ప్రమాదాలు నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతో కీలకంగా ఉపయోగపడతాయని ఎస్ఐ గదుల లక్ష్మణరావు అన్నారు. మండలంలోని అదపాక, వెంకటాపురం, గుర్రలాపాళెం, పైడాయవలస గ్రామాలకు వెళ్లే కూడళ్లల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్పి ఆదేశాలు మేరకు విజయ ప్లేస్టిక్ ఓనర్ మొరం మహేష్ మధు సౌజన్యంతో మూడు సిసి కెమెరాలు ఎర్పాటు చేసినట్లు చెప్పారు ఇటువంటి కార్యక్రమాలకు ప్రజాసహకారం అవసరమన్నారు. ఈ సిసి కెమెరాలు ప్రమాదాలు, దొంగతనాలు, ఇతర కేసులు దర్యాప్తులో కీలకమైన పాత్ర ఉంటుందని చెప్పారు. ప్రతి పంచాయతీల్లోనూ ముఖ్య కూడళ్ల వద్ద పంచాయతీ నిధుల నుంచి సర్పంచ్‌లు సిసి కెమెరాల ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు భాస్కరరావు, చక్రి పాల్గొన్నారు.


సిసి కెమెరాను ప్రారంభిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

ఐటిడిఎ పిఒ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మండలంలో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ఎర్రమానుగూడ, సవర చీడిపాలెం, నందలపాడు గ్రామాల్లో చేపడుతున్న మల్టీపర్పస్ సెంటర్ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలని అదేశించారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదన్నారు. భవన నిర్మాణ పనులకు తెచ్చిన ఐరన్ మెటీరియల్, సిమెంట్ ఇటుకలను నాణ్యత టెస్టు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మల్టీపర్పస్ భవనాలకు ఉన్న విద్యుత్ సమస్యలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే భరణికోట బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి బాగా

పనులను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

చదువుకొని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పది ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కులపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం కరజాడ పిహెచ్‌సిని సందర్శించి ఓపిని పరిశీలించారు. ప్రసవాలకు సంబంధించిన కేలెండర్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో బయో వ్యర్థాలను లేకుండా చూసుకోవాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని అన్నారు.

కబడ్డీ విజేత బొడ్డపాడు జెస్సి

ప్రజాశక్తి- పలాస

బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సవ సందర్భంగా ఈనెల ఒకటి నుంచి సోమవారం స్వగ్రామంలో రాష్ట్రస్థాయి ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. రాష్ట్రస్థాయి కబడ్డీ విజేతగా బొడ్డపాడు జెస్సి టీమ్ విజేతగా నిలిచింది. మూడు రోజుల పాటు ఈ పోటీలు అంగరంగ వైభోవంగా నిర్వహించారు. ఈ పోటీల్లో జెస్సి కబడ్డీ టీమ్ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. విజేతకు యువజన సంఘం అధ్యక్షుతు తామాడ క్రాంతి రూ.40 వేలు, షీల్డ్ బహుకరించారు. జెస్సి ఈవెంట్స్, కామేశ్వర ఎర్త్ మూవర్స్ అధినేత కిక్కర ఢిల్లీరావు సహాయ సహకారాలు అందజేశారు. ద్వితీయ బహుమతి బహడపల్లి జట్టు నిలవగా, ఈ జట్టుకు రూ.30 వేలు నగదు, షీల్డ్ అందజేశారు. ప్రవాస బొడ్డపాడు వాస్తవ్యులు అండమాన్ సిసిడబ్ల్యుఎస్ డైరెక్టర్ బొడ్డు రామారావు సాయం అందించారు. జైభీమ్ యువజన సంఘం అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు బహుమతిని అందజేశారు. తృతీయ బహుమతి విశాఖ వారియర్స్ దక్కించుకోగా, వీరికి రూ.20 వేలు నగదు, షీల్డ్ పద్మనాభపురానికి చెందిన మణికంఠ ఎర్త్ మూవర్స్ యాజమాని కొండే యుగంధర్ సాయం చేసి బహుమతిని అందజేశారు. చతుర్ద బహుమతి విజయనగరం దక్కించుకోగా, వీరికి రూ.పది వేలు నగదు, షీల్డ్ సాయినగర్‌కు అమరావతి దాభా యజమాని కరగాన కుమార్ సాయం అందజేశారు. ఆయన ప్రథమ కుమారుడు సుధా బహుమతులను అందజేశారు. ఇక బెస్ట్ అవార్డు, బెస్ట్ రైడర్ విజయనగరం వాసి ప్రసాద్ గెలుచుకున్నారు. ఈయన ప్రో కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటన్స్‌కు ఎంపికయ్యారు. ఈయనకు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు జగన్ అవార్డు బహుకరించారు. అలాగే బెస్ట్ డిఫెండర్ బహడపల్లి వాసి కోట పవన్‌కు దక్కగా ఈయనకు ఫార్మర్ నేషనల్ ప్లేయర్ రెయ్య మోహనరావు

షీల్డ్‌ను అందజేస్తున్న యువజన సంఘ సభ్యులు

బహుమతి అందజేశారు. బెస్ట్ ఆల్ రౌండర్ జెస్సి కబడ్డీ టీమ్‌కు చెందిన పవన్‌కు దక్కగా, ఈయనకు బొడ్డపాడు యువజన సంఘం కార్యవర్గ సభ్యుడు బొడ్డు శ్రీనివాస్ బహుకరించారు. మ్యాచ్ రిఫరీస్ అండ్ ఆల్ ఆఫీసియల్స్ అందరికి వ్యక్తిగత అవార్డ్స్ బహుకరించారు. కార్యక్రమంలో బివైఎస్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్, జెబిఒఎస్ ప్రెసిడెంట్ కిక్కర ఢిల్లీరావు, అన్నదాత రైతు సంఘం అధ్యక్షులు రాజాం శ్రీనివాస్, పెద్దలు రాజాం గుణవంతు, బత్తిని వాసు, బొడ్డు సింహాద్రి, సైనిక్ యూనియన్ అధ్యక్షులు తామాడ రామారావు, మాజీ సర్పంచ్ తామాడ త్రిలోచనరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు పోతనపల్లి గీతమ్మ, స్త్రీ విముక్తి మహిళా సంఘం అధ్యక్షలు రాజాం పద్మ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ గర్తం తులసీరావు పాల్గొన్నారు.

త్వరితగతిన వరి నూర్పులు

డిఎస్ఒ సూర్యప్రకాష్

ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న డిఎస్ఒ సూర్యప్రకాష్

పొందూరు: జిల్లాలో ఇంకా వరినూర్పులు చేపట్టని రైతులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి జి.సూర్యప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని కనిమెట్ట, కింతలి, పెనుబర్తి, తోలాపి, దల్లవలస, గోరింట, కోటిపల్లి గ్రామాల్లో నూర్పులు చేపట్టని ధాన్యం కుప్పలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే అనేక మండలాల్లో వరి నూర్పులు అయిపోయాయని తెలిపారు. పొందూరు మండలంలో వరి ఉత్పత్తి 14,000 టన్నులు కాగా, జిల్లా అధికారులు 8,000 టన్నుల లక్ష్యం విధించడంతో ఇప్పటికే ధాన్యం కొనుగోలను అధికారులు పూర్తి చేశారు. కానీ, పొలాల్లో అపరాలు సాగు కారణంగా వరి నూర్పులు చేపట్టడానికి వీలు కాలేదని, మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రైతులు అధికారులను కోరారు. దీంతో డిఎస్ఒ వరి కుప్పలు, నూర్పులు, ధాన్యం బస్తాలను పరిశీలించారు. ఈయనతోపాటు మండల వ్యవసాయ అధికారి బెండి బాబ్జి ఉన్నారు.

పిండినల్లి ఉధృతిపై అప్రమత్తం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జీడి తోటల్లో పింది దశలో సోకే పిండి నల్లి జబ్బు ఉధృతిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ పెద్దపేట శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని చీపురుపల్లిలో జీడి, మామిడి తోటలను మండల ఉద్యాన అధికారి సునీతతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం జీడి తోటలో పిందె దశలో పిండి నల్లి ఉధృతిని గమనించి పరిశీలించారు. దీని నివారణకు ప్రొఫెనోఫాస్ మందును రెండు ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ముందస్తుగా వేప నూనె, వేప సబ్బు కానుగ నూనె కలిపి ఐదు ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే... పిండి నల్లి ఉధృతిని తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. జూన్, జూలై నెలల్లో ఎరువులు

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజశేఖర్

యాజమాన్యం, పూతకు ముందస్తు దశలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే చీడపీడలను నివారిస్తూ అధిక దిగుబడులను పొందే అవకాశం ఉందన్నారు. మునగ పంటను పరిశీలించారు. దీనికి రసాయనక పద్ధతిలో ప్రొఫెషనల్ రెండు ఎంఎల్ ఒక లీటర్‌లో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారులు అవినాష్, రమ్య, అశాలత రైతులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ

బెంచీలపై కూర్చున్న ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి : తాను పనిచేస్తున్న పాఠశాలలో విద్యా బోధనకే పరిమితం కాకుండా పాఠశాలకు సిమెంట్ బెంచీ, కుర్చీలు వితరణగా ఇచ్చి ఆదర్శంగా నిలిచింది ఓ ఉపాధ్యాయిని. మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయులు జి.జగదాంబ పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా సిమెంట్ బెంచీలను ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ జగదాంబను ఆదర్శంగా తీసుకుని పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వివిధ స్థాయిల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, దాతలు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ముందుకు రావాలని కోరారు. అనంతరం జగదాంబకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమా శంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

ఎండుతున్న పైరు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని నందిగాంలో రబి సీజన్ వరి పైరు సాగునీరు లేక పొలాలు బీటలు మారుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో అంతంత మాత్రమే పంటలు రావడంతో ఈ రబీలోనైనా నష్టాన్ని అధిగమించవచ్చిన ఉద్దేశంతో రైతులు నాట్లు వేశారు. మండలంలోని నందిగాం, పెంటవూరు, నరేంద్రపురం, కోమటూరు, నర్సిపురం, జల్లపల్లి, దేవలభద్ర తదితర గ్రామాల్లో చెరువుల ఆయకట్టు రైతులు నాట్లు వేశారు. అయితే చెరువుల నీరు రెండు తడులకే ఎండిపోయాయి. దీంతో పైరుకు నీరు లేకపోవడంతో ఆవులకు, గొర్రెలకు మేతగా ఉపయోగిస్తున్నారు. నందిగాం, పెంటవూరులో వంశధార నీరు

ఎండుతున్న వరి పంట

వస్తుందన్న ఆశతో నాట్లు వేసిన రైతులు పొట్ట దశలో నీరు లేక వరుణుని వైపు చూస్తున్నారు. మరో 15 రోజుల్లో పాలు పోసుకుంటున్న దశలో నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిపిఎం నాయకులు పాలిన సాంబమూర్తి మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పెట్టుబడి పెట్టి పంట చేతికి వస్తుందని సమయంలో నీరు లేక వైర్లు ఎండిపోతున్నాయని అన్నారు. వంశధార కాలువ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

సర్వేల ప్రగతిపై సమీక్ష

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎమ్మెస్ ఎంఇ వర్కింగ్ ఫ్రమ్ హోమ్ సర్వేల ప్రగతిపై కమిషనర్ ఎన్.రామారావు సమీక్షించారు. పురపాలక సంఘ కార్యాలయంలో అడ్మిన్ కార్యదర్శులు, ఎమినిటీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలపై అలసత్వం వహిస్తే తగు చర్యలు తీకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి ప్రభాకరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్మోహనరావు

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- సోంపేట

భూసార పరీక్షల ఫలితాల ప్రాప్తికి ఎరువులను ఉపయోగించాలని ఎఒ నరసింహమూర్తి రైతులకు సూచించారు. మండలంలోని బారువ రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్మోహన్ చేతుల మీదుగా రైతులకు భూసార పరీక్షా ఫలితాలను అందజేశారు. అధికారులు సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులు వినియోగిస్తే సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పవిత్ర, లోలాక్షి, రైతులు పాల్గొన్నారు.

వ్యాకరణ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వ్యాకరణతో భాషపై పట్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వ్యాకరణతో ఏ భాషపైనా పట్టు సాధించవచ్చునని జ్ఞాన భారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్‌ఖాన్ అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం జాతీయ వ్యాకరణ దినోత్సవం నిర్వహించి పోటీలను నిర్వహించారు. ఐదు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల వరకు ఆంగ్ల భాష వ్యాకరణంపై విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించేందుకు ప్రత్యేక పరీక్షలను నిర్వహించారు. 300 మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ బాష పైన పట్టు కావాలన్నా ఆ భాషలో వ్యాకరణంపై పట్టు చాలా అవసరమని, విద్యార్థుల భాష నైపుణ్యాలను తెలుసుకునేందుకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మరికొద్ది రోజుల్లో తెలుగు, హిందీ, ఒడియా భాషల వ్యాకరణంపై విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తామని పేర్కొన్నారు. వ్యాకరణంలో వారి నైపుణ్యాలను మెరుగుపరుస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్‌మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్, పిఇటి కైలాస్ పండా పాల్గొన్నారు.

ధ్రువపత్రాలతో విద్యార్థులు

సంతూర్ స్కాలర్‌షిప్ మంజూరు

నరసన్నపేట : పట్టణంలో స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు విప్రోకేర్ సమస్త వారి సంతూర్ స్కాలర్‌షిప్ నిధులు మంజూరయ్యాయని సెక్రటరీ లక్ష్మీప్రసన్న తెలిపారు. ఈ మేరకు కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుపై ఆసక్తి ఉండి వారి ఆర్థిక పరిస్థితులు కారణంగా ఆపకుండా కొనసాగించడానికి సంతూర్ స్కాలర్‌షిప్ చేయూతనందిస్తుందని అన్నారు. ఈ విద్యా సంస్థ నుంచి 45 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికీ రూ.24 వేలు చొప్పున విప్రో సంస్థ నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. మూడేళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్‌లను జమ చేస్తుందన్నారు. విద్యార్థుల ఎంపికపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న జయరాం

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

బూర్జ : ప్రతి కార్యకర్తా కలిసికట్టుగా పనిచేసి జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం పిలుపునిచ్చారు. మండలంలోని కొల్లివలసలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోగలిగామని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ నె 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్పష్టం చేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీని మరింత పటిష్టం చేద్దామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తులగాపు మౌళి, కిల్లనా నరేష్, తులగాపు గౌతమ్, సైరగాపు వెంకటేష్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి వ్యాధి నిరోధక టీకాల ద్వారా పశువులన్నిటిని కాపాడుకోవాలని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు పిలుపునిచ్చారు. మండలంలో బొమ్మికలో వేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 13,200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడానికి లక్ష్యంగా నిర్ధేశించినట్లు చెప్పారు. నాలుగు మాసాల వయసు దాటిన పశువులన్నిటికీ ఈ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. నాలుగు నుంచి ఆరు మాసాల వయసుగల దూడలకు మొదటిసారి వేక్సిన్ వేసి నెల తర్వాత మళ్లీ బూస్టర్ డోసు వేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో నాలుగు బృందాలు ఈ టీకాల కార్యక్రమాన్ని చేస్తున్నట్లు చెప్పారు.

కోటబొమ్మాళి : టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

గాలికుంటు వ్యాధి నివారణ టీకా లను పశుపోషకులు అందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెదలోగిడి పశువైద్యాధికారి కె.మౌనిక, సిబ్బంది నిరంజన్ మోహన్, ఉత్తమరావు ఉన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో పశువులకు ముమ్మరంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని కోటబొమ్మాళి పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మెండపేట, పొన్నానపేట, పాకివలస, కొబ్బరిచెట్లుపేట, నారాయణవలస, నిమ్మాడ, సుబ్బారావుపేట తదితర గ్రామాలలో 891 పశువులకు టీకాలు వేశామన్నారు. చూడు, మూడు నెలలు దాటిన పశువులకు టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు అనంతరావు, కుటికుప్పల ముకుందరావు, జ్యోతికుమారి, వెంకటరత్నం, నర్సింహులు పాల్గొన్నారు.

మందస : హరిపురంలో పశువులకు గాలికుంటి వ్యాధి నివారణ టీకాలను మందస, హరిపురం పశు వైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతిలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది బాలకృష్ణ, శ్రీను, సంతోషి, లక్ష్మి, హరికృష్ణ, నేతాజీ, పార్వతి, రాజ్యలక్ష్మి, మురళి, ఇంతయాజ్, ఉమా పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు ప్రారంభం

పలాస : మండలంలోని బొడ్డపాడులో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలకు రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యుడు వి.శంకర్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి ఎస్.మూర్తి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు, కేంద్ర కమిటీ సభ్యులు నాగమణి, సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, రాష్ట్ర నాయకులు హరనాథ్, సత్యనారాయణ, కిరణ్ పాల్గొన్నారు.

ఆర్‌డిఒ పరిశీలన

నందిగాం : స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. పరిసరాలు, కార్యాలయ భవనం ఏ విధంగా ఉంది వంటి అంశాల గురించి తహశీల్దార్ పి.సోమేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు డిటి ఆర్.రామారావు, సిబ్బంది ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పలాస : ఈ నె 8న ఒంగోలులో నిర్వహిస్తున్న రెండు పిఒడబ్ల్యుల విలీన సభను విజయవంతం చేయాలని పిఒడబ్ల్యు సంస్థల అధ్యక్షులు ఎస్.కృష్ణవేణి తెలిపారు. మండలంలోని మాకన్నపల్లిలో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిఈశ్వరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, జిల్లా ఉపాధ్యక్షులు కుత్తుం హేమక్క, కోశాధికారి బర్ల జానకి, సైన కళావతి, తెప్పల మహిళా సంఘ సభ్యులు బత్తిని ఉమ పాల్గొన్నారు.

సిఎంకు ఆహ్వాన పత్రిక

ఆమదాలవలస : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును తన కుమారుడి వివాహానికి ఆహ్వానించినట్లు టిడిపి అధికార ప్రతినిధి మొదలవలస రమేష్ తెలిపారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఎమ్మెల్యే కూన రవికుమార్ తన కుమారుడు చంద్ర హర్షతో కలిసి సిఎం ఛాంబర్‌లో వివాహానికి రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ నెల 12న శ్రీకాకుళంలోని 80 ఫీట్ రోడ్డులో జరుగుతున్న తన కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులని ఆశీర్వదించాలని పెండ్లి పత్రిక అందించామని తెలిపారు.

ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రమేష్

మాన్యువల్ కౌన్సెలింగ్‌లోనే బదిలీలు చేపట్టాలి

మాట్లాడుతున్న రమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వెబ్ ఆధారిత బదిలీలపై ఉపాధ్యా యులకు నమ్మకం లేదని, అందువల్ల మ్యాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలోనే బదిలీలు చేపట్టాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఎస్‌టియు ఆధ్వర్యాన ఉపాధ్యాయుల బదిలీల చట్టంపై మంగళ వారం చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్షలాది మంది ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్‌పై అభ్యంతరాలు చెపుతున్నారు. అయినా విద్యాశాఖ విడుదల చేసిన డ్రాఫ్ట్‌లో వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ విధానమే ఉంటుందని ఉన్నతాధికారులు పేర్కొనడం సరికాదన్నారు. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థనలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్ష వైఖరితో ముందుకెళ్తుందని ఆరోపించారు. వెబ్ కౌన్సెలింగ్‌లో వేలాది ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు జిల్లాలో 3,500 నుంచి 5 వేల వరకు సీనియారిటీ జాబితా ఉంటుందని అన్నారు. సీనియారిటీలో చివరి ఉపాధ్యా యులు ముందున్న వేలాది ఆప్షన్లను ఎలా నమోదు చేయగలరన్నారు. ఈ చర్చా వేదికలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, జి.శ్రీను, ఎం. తేజ, చింతల రామారావు, చౌదరి జగన్ పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

భగవతి సేచ్ఛావతి ఆటో ఓనర్స్ డ్రైవర్ సంక్షేమ సంఘం సభ్యులు రెల్ల గోపి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆటో ఓనర్స్ డ్రైవర్ యూనియన్ నాయకులు రూ.50 వేలు చందాలు వేసుకున్నారు. ముత్యాలమ్మపేటలో ఉంటున్న బాధిత కుటుంబానికి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బడి మోహన్‌రెడ్డి, ఉల్లిసి ఎర్రయ్యరెడ్డి, మోహనరావు, పూర్ణచంద్ర సాహు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కంచిలి: మండలంలోని ఎం.ఎస్.పల్లికి చెందిన కుందల నరేష్ గొంతు కేన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు మంగళవారం అతడి కుటుంబానికి రూ.పది వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పైల వెంకట్, నీలాపు వంశి, నీలాపు కిరణ్, డి.సాయి, అశ్విన్ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై నైపుణ్యం అవసరం

చంద్రశేఖర్‌కు బహుమతిని అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థి ఎదుగుదలకు ఆంగ్ల భాష నైపుణ్యం అవసరమని విజయవాడ ఎంఎంఎం కళాశాల ఆంగ్ల ప్రొఫెసర్ బొడ్డపాటి చంద్రశేఖర్ అన్నారు. శ్రీకాకుళం మండలం గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ద్వితీయ భాషలు విభాగం మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంగ్లీష్ భాష అనేది నిరంతరం మార్పులకు, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా మార్పులు చెందుతుందన్నారు. మంచి భవిష్యత్ కోసం భాషా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల సమయంలో ఆంగ్ల భాషకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల విద్యార్థుల ఆంగ్ల బాషపై పూర్తి పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యనారాయణ, రచయిత జంధ్యాల శరత్‌బాబు, ఐక్యూఎసి సమన్వయకర్త డాక్టర్ మార్తండ కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిఐ బేబీ

నాటుసారా నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని మఠం సరియాపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం సోంపేట ఎక్సైజ్ సిఐ కె.బేబీ ఆధ్వర్యాన నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నాటుసారా నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అక్రమంగా నాటుసారా తయారు చేసిన, రవాణా, విక్రయాలు చేపట్టిన వారిని సమాచారం అందజేసి సహకరించాలని కోరారు. నాటు సారా రహిత సమాజ స్థాపనకు పౌరులందరూ తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో కుప్పిలి వెంకటరావు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు, బహుమతులతో విద్యార్థులు

ప్రాథమిక విద్య భవిష్యత్‌కు నాంది

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్‌కు ప్రాథమిక విద్య నాంది పలుకుతుందని, ఈ దశలో విద్యార్థులు చూపిన ప్రతిభ వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య అన్నారు. ఇటీవల శ్రీకాకుళం - విజయవాడలో నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్, బాల్రంగ్ పోటీల్లో ప్రథమ స్థానం, భోపాల్ నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, వారికి శిక్షణ కల్పించిన ఉపాధ్యాయులు పి.బి.కె.శర్మ, యు.గిరిబాబు, ఎన్.ఇ.శర్మలకు మంగళవారం అభినందన పత్రాలు, బహుమతులు అందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు కె.జానకిరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఇఒ ధనుంజయ

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- కవిటి

కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. అనంతరం క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పండి బలరామ్మూర్తి, బెందాళం రమేష్, ఆరంగి మధు, పాండవ శేఖర్, ప్రిన్సిపాల్ బిందుమాధవి, ఎఒ రాణి పాల్గొన్నారు.